
# అనంతపురంజిల్లా తొలి కథా రచయుత,
# సాహితీ విమర్శకుడు
# గుత్తి రామకృష్ణ మరణానికి సంతాపం

సీనియర్ పాత్రికేయుడు, అనంతపురంజిల్లా తొలి కథా రచయిత, సాహితీ విమర్శకుడు, తొలితరం కమ్యూనిస్టు ఐన గుత్తి రామకృష్ణ తన 95వ ఏట మే 12 (2009)న అనంతపురంలో మరణించారు.



గుత్తి రామకృష్ణ 1915 జులై 13వ తేదీన అనంతపురంలో జన్మించారు. అడివి బాపిరాజు ప్రిన్సిపల్‌గా వున్న బందరు నేషనల్ కాలేజిలో చదివారు. కాటూరి, ముట్నూరిలాంటి సాహితీవేత్తల ప్రభావంతో ఆయనకు సాహిత్యంపట్ల అభిరుచి పెరిగింది.

అనంతపురంజిల్లాలో తొలి కమ్యూనిస్టుశాఖలో ఐదుకల్లు సదాశివన్, తరిమెల నాగిరెడ్డి, నీలం రాజశేఖరరెడ్డి, విద్వాన్ విశ్వంలతోపాటు ఆయన సంస్థాపక సభ్యుడు. అనంతపురంలో ప్రగతిశీల సాహిత్యం పాఠకులకు చౌకగా అందించడానికి 15 ఏళ్ళపాటు బుక్‌స్టాల్‌ను నిర్వహించారు. ఆయన తన 95 ఏళ్ళ జీవితంలో 70 ఏళ్ళపాటు జర్నలిస్టుగా పనిచేశారు. అనంతపురంజిల్లాలో తొలి జర్నలిస్టు ఆయనే.

గుత్తి రామకృష్ణ పది కథలు వ్రాశారు. వాటిలో ఐదు మాత్రమే ప్రచురితమయ్యాయి. 'చిరంజీవి' (1941), 'గంజి కోసరం' (1953), 'జొన్న చీమ' (1954), 'వడ్ల గింజలు' (1953) మొదలగునవి అడివి బాపిరాజు ప్రభావంతో ఆనాడే వ్యవహారిక భాషలో, అభ్యుదయ దృక్పథంతో రాయలసీమ నుడికారంతో ఆయన వ్రాశారు. జిల్లా రచయితల సంఘం, జిల్లా జర్నలిస్టుల సంఘం ఏర్పాటుకు కృషి చేశారు. పలు పత్రికలకు పాత్రికేయులుగా పనిచేశారు.

'ఆకాశవాణి' అనే రహస్య పత్రిక నడపడంలో చురుకైన పాత్ర నిర్వహించిన క్రమంలో అరెస్టయి అల్లీపూర్ జైలులో శిక్షననుభవించారు. 1948 ప్రాంతంలో అరెస్టయి, కడలూరు జైలులో పోలీసులు జరిపిన కాల్పులలో ఒక కన్ను పోగొట్టుకున్నారు.

ప్రజల బాధలు పత్రికల్లో వుండాలనీ, పత్రికలు ప్రజాపక్షం వహించాలనీ, జర్నలిస్టులు నీతి, నిజాయితీ నిబద్ధతలే కొలబద్దలుగా హృదయంతో తమ కలాలు కదిలించాలనీ నమ్మి, ఆ విధంగా జీవితాంతం కృషి చేసిన గుత్తి రామకృష్ణ మరణానికి ప్రజాసాహితి సంతాపం ప్రకటిస్తోంది. వారి కుటుంబసభ్యులకు సానుభూతి తెలియచేస్తోంది.

